క్లుప్తంగా

చెరువు సమస్యపై జేసీకి వినతి



పమిడిముక్కల: మంటాడ శివారు రెడ్డిపాలెంలో ఇళ్ల మధ్యలో 5 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కలుషితమైన చెరువును శుభ్రం చేయించాలని సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ జేసీకి వినతిపత్రం అందజేశారు. కలెక్టరేట్‌లో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో జేసీ అపరాజితసింగ్‌ను కలిసి వినతిపత్రం అంద జేసి సమస్యను వివరించారు. రెడ్డిపాలెంలో ఇళ్ల మధ్య ఉన్న ఈ చెరువు 1100 కుటుంబాలకు అనారోగ్య హేతువుగా మారిందని, చెరువులో గుర్రపుడెక్క, ముళ్లకంప పెరిగి దుర్వాసన వెదజల్లుతుందని వివరించారు. చెరువును పరిశుభ్రం చేయించేందుకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

రేపటి నుంచి రైల్వేగేట్ మూసివేత

గుడివాడ రూరల్: గుడివాడ మండలం గుంటా కోడూరు–పరనాస రైల్వే గేట్ మరమ్మతుల కారణంగా నవంబర్ 1వ తేదీ నుంచి 3 వరకు రైల్వే గేట్ మూసివేయనున్నట్లు సీనియర్ సెక్షన్ ఇంజినీర్ ఎం.శివప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రయాణికులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవలసినదిగా ఆయన కోరారు.

కుంగిన రహదారి



పమిడిముక్కల: వీరంకిలాకు–కూచిపూడి ప్రధాన రహదారిపై బొడ్డువానిగూడెం వద్ద ఆర్ అండ్‌బీ రోడ్డు కుంగి ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డుపై పలుచోట్ల పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. రాళ్లు పైకి లేచి ప్రమాదకరంగా ఉన్నాయి. బొడ్డువానిగూడెం, అగినపర్రు, మామిళ్లపల్లి గ్రామాల ప్రజలు నిత్యం రహదారిపై రాకపోకలు సాగిస్తుంటారు. రహదారికి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. రహదారి పరిస్థితిని ఆర్అండ్‌బీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లానని, అభివృద్ధికి చర్యలు తీసుకొంటున్నానని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ తెలిపారు.

వాటర్ ట్యాంక్ సామర్థ్యం పరిశీలన

గుడివాడ టౌన్: స్థానిక కోతిబొమ్మ సెంటర్‌లో నూతనంగా నిర్మిస్తున్న వాటర్ ట్యాంక్ ఇన్‌వర్ద్, అవుట్‌వర్డ్ సామర్థ్యాలు బాగున్నాయని పట్టణ డ్రింకింగ్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యుడు కె.ఆంజనేయ ప్రసాద్ అన్నారు. సోమవారం ఆయన సంపుల లీకులు, ఇతర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో ఈ వాటర్ ట్యాంక్ ప్రజలకు అంకితం చేయనున్న నేపథ్యంలో పూర్తి స్థాయిలో వీటి పనితీరును పరిశీలిస్తున్నామన్నారు. నీటిని బయటకు వదిలే సమయంలో ఏమాత్రం లీకులు ఉన్నా దాని వలన నష్టం జరుగుతుందని తక్కువ సామర్థ్యంలోనే వాటిని గమనించడం వలన వెంటనే పరిష్కరించవచ్చని ఆయన తెలిపారు.

ఐదు ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం



తోట్లవల్లూరు: ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్న ఘటన మండలంలోని రొయ్యూరులో జరిగింది. గ్రామంలోని పలు ప్రదేశాల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను ఎస్ఐ పి.విశ్వనాథ్ సోమవారం ఉదయం పట్టుకున్నారు. పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లను ఆయన తహసీల్దార్ కార్యాలయానికి తరలించి అప్పగించారు. అక్రమరవాణాకు పాల్పడుతున్న ట్రాక్టర్లకు తగిన జరిమానా విధించనున్నట్లు డీటీ ధనలక్ష్మి తెలిపారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం కృషి



ముదినేపల్లి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్



లింగవరంలో వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ నాగమణివిక్టర్

ఎమ్మెల్యే డీఎన్నార్

ముదినేపల్లి రూరల్: రాష్ట్రంలోని ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. ముదినేపల్లి జెడ్పీ హైస్కూల్లో సోమవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లోని ప్రతి కుటుంబం వద్దకు వైద్యులను పంపించి స్వల్ప, దీర్ఘకాల వ్యాధులను గుర్తించడంతో పాటు వాటి నివారణకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. విద్య, వైద్యరంగాలకు పెద్దపీట వేస్తూ సీఎం వైఎస్ జగన్ విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటున్నారన్నారు. ఇలాంటి ప్రజాసంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టి పారదర్శకంగా, సమర్థవంతంగా అమలు చేస్తున్న ముఖ్యమంత్రిని ప్రతి కుటుంబం ఆశీర్వదించాలని కోరారు. శిబిరంలో ఏర్పాటుచేసిన కౌంటర్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఇటీవల మరణించిన కుంచే రమేష్ కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణసాయం కింద రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రామిశెట్టి సత్యన్నారాయణ, జెడ్పీటీసీ ఈడే వెంకటేశ్వరమ్మ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, సర్పంచ్ నిమ్మగడ్డ కై కమ్మ, ఎంపీటీసీల సభ్యులు మరీదు నాగయ్య, జంపాన కోటయ్య, సొసైటీ అధ్యక్షురాలు మన్నెం రమాదేవి, వైఎస్సార్ సీపీ నాయకులు మోట్రు ఏసుబాబు, నిమ్మగడ్డ భిక్షాలు, కోమటి విష్ణువర్ధన్, రాయన నాగరాజు, ఈడే వెంకటేశ్వరరావు, సోమా సత్యనారాయణ, గంటా కోటేశ్వరరావు, డీఎల్పీవో పూర్ణచంద్రరావు, ఎంపీడీవో పీ మల్లీశ్వరీ, సీడీపీవో ఆనంద్, ఈవోపీఆర్డీ డి లక్ష్మీనారాయణ, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



గుడివాడలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ తదితరులు

490 మందికి వైద్య సేవలు

గుడివాడరూరల్: పేదలకు కార్పొరేట్ వైద్యం అందించడమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ముఖ్యఉద్దేశమని గుడివాడ మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ మట్టా నాగమణివిక్టర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని లింగవరం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంపీపీ గద్దే పుష్పరాణి, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్, అధికారులు, ప్రజాప్రతినిధులతో కలసి సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమానికి నిరంతరం పాటు పడుతున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. మోటూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సతీష్‌కుమార్ మాట్లాడుతూ ఈ క్యాంప్‌లో 490 మందికి వివిధ రకాల వైద్య సేవలు అందించి మందులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరమణ, తహసీల్దార్ కె.ఆంజనేయులు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గద్దే వెంకటరామాంజనేయులు(రాము), కళ్లేపల్లి శంకరరావు, వీఆర్వో సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి కె.అనూల, వైద్యులు, సచివాలయ ఉద్యోగులు, వైద్య,ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గుడివాడ టౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య పరీక్షలకు విశేష స్పందన లభిస్తుందని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ అన్నారు. స్థానిక నాగవరప్పాడు బీసీ హాస్టల్ ప్రాంగణంలో సోమవారం 36వ వార్డు సచివాలయ పరిధి వారికి ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ శిబిరంలో పురుషులు 353, మహిళలు 502, మొత్తం 855 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ కాలనీ పురపాలక సంఘ పాఠశాలలో 10వ వార్డు సచివాలయ వైద్యశిబిరాన్ని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మెరుగుమాల కాళీ ప్రారంభించారు. ఈ శిబిరంలో పురుషులు 435, మహిళలు 471, మొత్తం 906 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, పార్టీ నాయకులు కుర్మా రాజు, విక్టర్ పాల్, సీహెచ్ జోషి, మేరుగు వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకే సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్
- కుంపటివాని గూడెంలో గడప గడపకు మన ప్రభుత్వం



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్

వేములమడ(మొవ్వ): ప్రజల ముంగిటకే సంక్షేమ ఫలాలను అందిస్తున్న ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే సాధ్యమని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ పేర్కొన్నారు. మండలంలోని వేములమడ గ్రామంలోని కుంపటివానిగూడెంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించారు. కాలనీకి వచ్చిన ఎమ్మెల్యేకు ప్రజలు అపూర్వస్వాగతం పలికారు. ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ ముందుగా గ్రామంలోని మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి నాయకులతో కలిసి పూలమాలలేసి నివాళులర్పించారు. అధికారులు, వలంటీర్లు, నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్లను అందజేశారు. పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు ఏమేరకు లబ్ధి చేకూరుతుందో వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలతో అవినీతి రహిత పాలన ప్రజలకు అందుతుందని, సంక్షేమ ఫలాలు ప్రజలకు నేరుగా అందుతున్నాయన్నారు. గ్రామంలో అంతర్గత రహదారులు, డ్రెయిన్లు, చేయాలని, వీటి లైట్లు వెలగక ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యే కైలే అనిల్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొండేటి ఇందిర, సర్పంచ్ వేములమడ సీతారామయ్య, ఎంపీటీసీ, మండల సచివాలయాల కన్వీనర్ సమ్మెట ఆంజనేయులు, మండల పార్టీ అధ్యక్షులు రాజులపాటి రాఘవరావు, ఎంపీడీవో జి.సుధా ప్రవీణ్, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు మురారి శ్రీనివాసరావు (బాబు), పీఏసీఎస్ అధ్యక్షుడు సీహెచ్ బ్రహ్మయ్య, మాజీ సర్పంచ్ మురారి శ్రీనివాసరావు, నాయకులు చాట్ల అజయ్‌కుమార్, గోగినేని పెరుమాళ్లు, మంద శ్రీనివాస రెడ్డి, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అందుబాటులో ఓటర్ల జాబితా



కె.ఆంజనేయులు తహసీల్దార్

గుడివాడరూరల్: పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల జాబితాలు అందుబాటులో ఉన్నాయని మార్పులు, మార్పులు, ఎన్నికల సంఘ నిబంధనల ప్రకారం అభ్యంతరాలు ఉంటే డిసెంబర్ 9వ తేదీలోపు ఫిర్యాదు చేయాలని తహసీల్దార్ కే ఆంజనేయులు తెలిపారు. గుడివాడ అసెంబ్లీ నియోజకవర్గంలో డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా వివరాలను తహసీల్దార్ కె.ఆంజనేయులు సోమవారం వెల్లడించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గుడివాడ నియోజకవర్గ పరిధిలోని 230 పోలింగ్ కేంద్రాల్లో లక్షా 96 వేల 843 మంది ఓటర్లు ఉన్నారన్నారు. వీరిలో 94 వేల 664 మంది పురుషులు, లక్షా 2163 మంది మహిళా ఓటర్లు ఉండగా 16 మంది ఇతరులు ఉన్నట్లు వెల్లడించారు. 2024 జనవరి 1వ తేదీ లోపు 18 ఏళ్లు నిండిన వారు డిసెంబర్ 9వ తేదీలోపు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 2024 జనవరి 5వ తేదీన తుది జాబితా పబ్లిష్ అవుతుందని స్పష్టం చేశారు. ఎటువంటి సందేహాలు ఉన్నా సమీపంలోని ఎన్నికల అధికారులు, మండల తహసీల్దార్ కార్యాలయాల్లో సంప్రదించాలని తహసీల్దార్ ఆంజనేయులు కోరారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, కోచ్



విజేతలైన విద్యార్థులతో హెచ్‌ఎం ఉషారాణి

కాజ(మొవ్వ): మండలంలోని కాజ గ్రామంలోని పేకేటి నరసారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇద్దరు ఎస్‌జీఎఫ్‌ఐ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం టీవీ రమణి తెలిపారు. పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న సువర్ణ బాల్‌బ్యాడ్మింటన్ విభాగంలో నవంబర్ 4వ తేదీన నెల్లూరు జిల్లా ఆత్మకూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటుందని, అలాగే తొమ్మిదో తరగతి విద్యార్థి నాగలక్ష్మణ్ సాఫ్ట్‌బాల్ విభాగంలో నవంబర్ 4వ తేదీన ప్రకాశం జిల్లా ఒంగోలులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. ఈ క్రీడాకారులకు, తర్ఫీదు ఇచ్చిన పీడీ నాగబసవయ్యను పలువురు అభినందించారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు..

జమీగొల్వేపల్లి(పామర్రు): గుడివాడలోని పొట్టి శ్రీరాములు ఉన్నత పాఠశాలలో ఈనెల 27, 28 తేదీల్లో నిర్వహించిన జిల్లా స్థాయి ఖోఖో సెలక్షన్స్‌లో జమీగొల్వేపల్లి హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన సందర్భంగా సోమవారం అభినంద కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా హైస్కూల్ హెచ్‌ఎం టీ ఉషారాణి మాట్లాడుతూ కృష్ణా జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్–17 బాలుర విభాగంలో ఎం.హర్షవర్ధన్, ఎన్.చందు, బాలికల విభాగంలో డి.ఏసు ప్రియ ఎంపిక అయ్యారన్నారు. అండర్–14 బాలుర విభాగంలో ఎం.ప్రకాష్, బాలికల విభాగంలో కె.ఊర్వ, కె. వెంకట ధనలక్ష్మి ఎంపిక అయ్యారని అన్నారు. వీరు త్వరలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ఎంపికైన విద్యార్థులను వీరికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్.రవి బాబును హెచ్‌ఎం. ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.



విజేతలైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ పూర్ణచంద్రారెడ్డి

వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు..

పామర్రు: జిల్లా స్థాయిలో నిర్వహించిన వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పలువురు అభినందించారు. స్థానిక యలమర్రు రోడ్డులోని ఏఎస్ఎం హైస్కూల్‌లో సోమవారం విజేతలైన విద్యార్థులను అభినందించారు. ఈసందర్భంగా ఏఎస్ఎం హైస్కూల్ ప్రిన్సిపాల్ ఏ పూర్ణచంద్రారెడ్డి మాట్లాడుతూ విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈనెల 27వ తేదీన అండర్–14,17 విభాగాలలో వెయిట్ లిఫ్టింగ్ పోటీలలు నిర్వహించారని అన్నారు. ఈ పోటీల్లో అండర్–17 విభాగంలో పదో తరగతికి చెందిన చైతన్య లక్ష్మి, తేజస్వి, కీర్తనలు ప్రథమ స్థానం సాధించారు. అండర్–14 విభాగంలో తొమ్మిదో తరగతికి చెందిన రిషిత, అస్మిత, అభిషేక్, ఆరో తరగతికి చెందిన కార్తికేయ ద్వితీయ స్థానంలో గెలుపొంది ప్రశంసా పత్రాలు పొందారు. వీరు నవంబరు నెలలో జరిగే రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు హాజరు కానున్నారు. విజేతలైన విద్యార్థులను వీరికి శిక్షణ ఇచ్చిన కరాటే కోచ్ వీవీఎస్ రామకృష్ణలను ప్రిన్సిపాల్, అధ్యాపక సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

కోడి పందేల శిబిరంపై దాడి

కలిదిండి: మండలంలోని సంతోషపురం గ్రామంలో కోడి పందేలు నిర్వహిస్తున్న ఏడుగురు పందెంరాయుళ్లను సోమవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.4,100తో పాటు ఓ పందెం కోడిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ప్రియకుమార్ తెలిపారు. కలిదిండి గ్రామంలో ఇందిరా కాలనీలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని, అతని నుంచి రూ.1040 విలువ గల 8 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చెప్పారు.

నేడు టీటీడీ ప్రచార రథం రాక

కైకలూరు: తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన ప్రచార రథం స్థానిక శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయానికి మంగళవారం సాయంత్రం 5 గంటలకు వస్తుందని ఆలయ కార్యనిర్వహణాధికారి వీఎన్‌కే శేఖర్ సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొనవలసిందిగా కోరారు.

రోడ్లపై ఆవుల తరలింపు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగరంలో రహదారులపై సంచరించే పశువులను నివారించాలని జిల్లా కలెక్టర్ రాజాబాబు ఆదేశాలను మున్సిపల్ అధికారులు సోమవారం నుంచి అమలు చేస్తున్నారు. నగరంలో ప్రధాన రహదారిలో సంచరిస్తున్న ఆవులను పారిశుద్ధ్య కార్మికులు తరలించే పనులు చేపట్టారు. మున్సిపల్ కార్మికులు బృందాలుగా ఏర్పడి రోడ్లపై సంచరిస్తున్న ఆవులను తోలుకు వెళ్లి గో సంఘానికి అప్పగిస్తున్నారు. ఆవుల యజమానులు ఆవులు, గేదెలను రోడ్లపై వదిలేస్తే వాటిని గోశాలకు తరలించి యజమానులకు అపరాధ రుసుం విధిస్తామని అధికారులు హెచ్చరించారు.

ప్రజా చైతన్య యాత్రకు ఎమ్మెల్యే సంఘీబావం



జయకుమార్‌కు సంఘీబావం తెలుపుతున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

పామర్రు: ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు జగనన్న రాష్ట్ర అభిమాన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కావూరి జయకుమార్ నిర్వహిస్తున్న 100 రోజుల ప్రజా సంకల్ప యాత్ర 49వ రోజు సోమవారం పామర్రుకు చేరుకుంది. ఈ యాత్రకు పామర్రులో ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా జయకుమార్ మాట్లాడుతూ సెప్టెంబరు 12న ఇడుపులపాయ వద్ద ప్రారంభమైన ఈ ప్రజా చైతన్య యాత్ర డిసెంబరు 21న ఇచ్ఛాపురం జగనన్న ప్రజాసంకల్ప పాదయాత్ర పైలాన్ వద్దకు చేరుకుంటుందన్నారు. రాష్ట్ర భవిష్యత్ కోసం మరలా జగనన్నను ముఖ్యమంత్రి చేసుకుందామని 175 నియోజకవర్గాలకు 175 నియోజకవర్గాల్లో విజయఢంకా మోగాలని కోరుకుంటూ యాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ జయకుమార్‌కు స్వాగతం పలికి, సన్మానించారు. ఎమ్మెల్యే చైతన్య యాత్రలో పాల్గొని సంఘీబావం తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు సానుభూతి పరులు పాల్గొన్నారు.


సమస్యలపై 'స్పందన'లో వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

మండవల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక జిల్లా కార్యదర్శి ఎల్ఎస్ భాస్కరరావు, మండల అధ్యక్షుడు టి.అప్పారావు మండవల్లిలోని సమస్యలపై తహసీల్దార్ కె.రాజ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. మండవల్లి మేజర్ పంచాయతీని గ్రేడ్–3 నుంచి గ్రేడ్–1గా మార్చాలని, జనాభా ప్రాతిపదికన రెండో సచివాలయం ఏర్పాటు చేయాలని, పర్మినెంట్ కార్యదర్శిని నియమించాలని, నీటి కుళాయిల బకాయిలు వసూలు చేయాలని, కనీస మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు వినతిపత్రం తహసీల్దార్‌కు అందించారు. కె మార్కురాజు, బి.రంగారావు పాల్గొన్నారు.

ఎస్సీ మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



ఘంటసాల(అవనిగడ్డ): ప్రభుత్వం అందించే పలు శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని ఎస్సీ మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేయాలని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీలత కోరారు. ఘంటసాల ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, కేవీకే ఆధ్వర్యంలో ఎస్సీ మహిళలకు మూడు రోజుల పాటు నిర్వహించిన చిరుధాన్యాల ఆధారిత ఉత్పత్తి తయారీపై శిక్షణా కార్యక్రమం సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా శ్రీలత మాట్లాడుతూ.. శిక్షణ పొందిన మహిళలు చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. కేవీకే గృహ విజ్ఞాన శాస్త్రవేత్త కృష్ణవేణి మాట్లాడుతూ చిరుధాన్యాల ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో దాలిపర్రు సర్పంచ్ డోకిపర్తి శాంతకుమారి, కేవీకే శాస్త్రవేత్తలు వి.మంజువాణి, జె.యశ్వంత్‌కుమార్, డాక్టర్ రేవతి, డాక్టర్ నవీన్, పలు గ్రామాలకు చెందిన మహిళలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి 'గురు స్పందన' అవార్డు



పామర్రు: మండల పరిధిలోని ప్రాకర్ల గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు రాయన శివరామ ప్రసాద్‌కు 'గురు స్పందన' అవార్డు లభించింది. ఈ సందర్భంగా శివరామ ప్రసాద్ మాట్లాడుతూ ఏలూరులో స్పందన ఈద ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఈద శామ్యూల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఉపాధ్యాయులకు 'గురు స్పందన' అవార్డు–2023 కార్యక్రమం నిర్వహించారు. యువతలో ఆత్మవిశ్వాసం నింపే కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు గాను ఈ అవార్డుకు ఎంపిక చేశారని శివరామ్ ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్ఎల్‌సీ షాబ్జి, ఏలూరు జిల్లా విద్యాశాఖ అధికారి పి.శ్యామ్ సుందర్‌లు సన్మానించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు శివరామ ప్రసాద్‌ను అభినందించారు.

భూసర్వే పరిశీలన

మండవల్లి: మండలంలోని ఫేజ్–1 గ్రామాలైన లోకుమూడి, చావలిపాడు, అప్పాపురం, మొఖాసాకలవపూడి, పసలపూడి, ఫేజ్–2 గ్రామాలు సింగనపూడి, మూడుతాళ్లపాడుల్లో నిర్వహిస్తున్న జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్షణ కార్యక్రమాన్ని ఈఓపీఆర్డీ బి. ఆనందబాబు సోమవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామకంఠంలో ఉన్న భూముల్లో, శాశ్వత భూహక్కు కలిగేవిధంగా పట్టాలు అందజేసే ప్రక్రియను ప్రభుత్వం కల్పించిందన్నారు. దీనిద్వారా ఏళ్లతరబడి గ్రామకంఠం భూమిలో ఉన్న లబ్ధిదారులకు పట్టాలు వచ్చి వారికి హక్కు ఏర్పడుతుందని తెలిపారు. కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సేవల్లో వేళలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ ఆనంద్

కైకలూరు: అంగన్‌వాడీ కేంద్రంలో అందించే సేవలన్నీ లబ్ధిదారులకు నిర్ణీత సమయంలో అందజేయాలని కైకలూరు ప్రాజెక్టు సీడీపీవో బి.ఆనంద్ తెలిపారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో కైకలూరు, కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి మండలాల అంగన్‌వాడీ సెక్టార్ లీడర్స్, ప్రాజెక్ట్ లీడర్‌కు సోమవారం సీడీపీఓ బి.ఆనంద్ అధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండాలని, ఆన్‌లైన్ వర్క్స్ సమయానికి చేయాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రాల అధికారులు పాల్గొన్నారు.

సర్వేకు నాలుగు గ్రామాల ఎంపిక

ముదినేపల్లి రూరల్: స్వమిత్ర సర్వేకు మండలంలో తొలి విడతగా నాలుగు గ్రామాలను ఎంపిక చేసినట్లు ఈవోపీఆర్డీ డి.లక్ష్మీనారాయణ సోమవారం తెలిపారు. మండలంలోని అల్లూరు, ఈడేపల్లి, సంఘర్షణపురం, పెదకామనపూడి గ్రామాలను ఈ సర్వేకు ఎంపిక చేసినట్లు చెప్పారు. ఈ గ్రామాల్లో నివాసప్రాంతాలపై ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం ద్వారా సర్వే జరుగుతుందన్నారు. గ్రామకంఠాల్లోనే స్థలాలకు సర్వే నంబర్లకు కూడా పొందుపరుస్తారన్నారు. ఇప్పటివరకు పలు గ్రామాల్లో గ్రామకంఠాల్లో ఉన్న స్థలాల రిజిస్ట్రేషన్లకు ప్రజలు ఇబ్బందులు పడేవారన్నారు. ఈ సర్వే తరువాత ఇలాంటి సమస్యలు తొలగిపోయి రిజిస్ట్రేషన్లు సులువుగా జరుగుతాయన్నారు. సర్వేలో గ్రామాల మ్యాప్‌కు సంబంధించి అన్ని అంశాలు తెలుస్తాయన్నారు.